# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

మంగళవారం / 27.02.2024


# మహాలక్ష్మి పథకం గైడ్‌లైన్స్ విడుదల..



**తెలంగాణ వీణ , హైదరాబాద్** : ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కొటిగా అమలు చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. తాజాగా, రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను మంగళవారం (ఫిబ్రవరి 27న) ప్రారంభిస్తోంది. ఈ నేపథ్యంలో మహిలక్ష్మి పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళల ఆరోగ్యం కాపాడుతూ, పొగబారి నుంచి వారికి విముక్తి కల్పించడం మహాలక్ష్మీ పథకం ముఖ్య ఉద్దేశ్యమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజా మార్గదర్శకాల ప్రకారం... ప్రజా పాలన దరఖాస్తు చేసుకుని ఉన్నవాళ్లు అర్హులవుతారు.తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నవాళ్లకి గ్యాస్ సిలిండర్ రాయితీ పథకం వర్తిస్తుందని తెలిపింది. గడిచిన మూడేళ్లుగా గ్యాస్ సిలిండర్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకోనుంది సబ్సిడీని ప్రభుత్వం ప్రతినెలా ఆయా కంపెనీలకు చెల్లింపులు చేస్తుంది. ముందుగా మొత్తం నగదును లబ్దిదారులను చెల్లిస్తే 48 గంటల్లో దానిని బ్యాంకు ఖాతాకు జమచేస్తామని తెలిపింది. భవిష్యత్తులో ముందుగానే నగదును గ్యాస్ కంపెనీలకు చెల్లిస్తామని పేర్కొంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, రూ.500లకు గ్యాస్ సిలిండర్, నెలకు రూ.2,500 నగదు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో పథకాన్ని పట్టాలెక్కిస్తోంది.రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రెండో రోజునే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఉచిత విద్యుత్, రాయితీపై గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తోంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సెక్రటేరియట్ లోనే రెండు పథకాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 500 రూపాయలకే గ్యాస్, 200 యూనిట్ల ఫ్రీ కరెంటు పథకాలను మధ్యాహ్నం సీఎం రేవంత్, మంత్రులు లాంఛనంగా ప్రారంభిస్తారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్ నగర్‌లో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఉన్నందున దాని కూడా కోడ్ వర్తించనుంది. మధ్యాహ్నం చేవెళ్లలో రాజకీయ సభ నిర్వహించే అవకాశం ఉంది.

# హరిహర వీరమల్లు నుంచి క్రేజీ అప్‌డేట్..



**తెలంగాణ వీణ , సినిమా** : ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ దృష్టి మొత్తం ఆంధ్రప్రదేశ్ ఎన్నకలపైనే ఉంది. ఇందుకోసమే తన చేతిలో ఉన్న సినిమా షూటింగ్‌లన్నీ నిలిపివేశారు. దీంతో పవన్ సినిమాల సంగతి ఏంటో అర్థం కాక ఫ్యాన్స్ డీలా పడిపోయారు. ఇలాంటి వేళ హరిహర వీరమల్లు సినిమా గురించి ఓ క్రేజీ న్యూస్ బయటికొచ్చింది.

## రెండు భాగాలుగా

ఇటీవల హరిహర వీరమల్లు చిత్ర నిర్మాత ఏఎమ్ రత్నం ఈ ప్రాజెక్ట్ గురించి మాట్లాడారు. హరిహర వీరమల్లు సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేస్తున్నట్లు క్లారిటీ ఇచ్చారు. సినిమా క్యాన్సిల్ అవుతుందంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ఈ చిత్రం VFX పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. "పవర్ స్టార్ అభిమానులకి మంచి సినిమా ఇచ్చే విషయంలో మేము కట్టుబడి ఉన్నాం. కేవలం లాభం మాత్రమే మా ఉద్దేశం కాదు. ఎన్నికల తర్వాత పవన్ తిరిగి వచ్చాక సినిమా షూటింగ్ మళ్లీ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం." అంటూ రత్నం చెప్పారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక యానిమల్ స్టార్ బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి ఈ సినిమాను డైరెక్టర్ చేస్తున్నారు. ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

## ప్రోమో కోసం

ఈ సినిమా ఆగిపోయిందంటూ తెగ వార్తలు రావడంతో ఇటీవల నిర్మాణ సంస్థ ఓ క్లారిటీ ఇచ్చింది."హరిహర వీరమల్లు చిత్రం వీఎఫ్ఎక్స్ పనులు ఇరాన్, కెనడా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. ఈ చిత్రం మీ అందరి ఊహలకి మించి ఉండబోతుంది. మీ అందరినీ థియేటర్లో సీటు అంచున కూర్చోబెట్టే ఓ స్పెషల్ ప్రోమోను త్వరలోనే వదులుతాం. అప్పటివరకు ఫ్యాన్స్ ఆత్రుతగా వేచి చూడండి." అంటూ చిత్ర నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ సోషల్ మీడియాలో అప్‌డేట్ ఇచ్చింది.

17వ శతాబ్దం నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో పవన్ ఓ వీరుడిగా కనిపించబోతున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకి మాటలు రాస్తున్నారు. ఇది పవన్ కళ్యాణ్ చేస్తున్న తొలి పాన్-ఇండియన్ మూవీ కావడం విశేషం. కొవిడ్ సంక్షోభంతో పాటు పవన్ పాలిటిక్స్‌లో బిజీగా ఉండటంతో ఈ చిత్రం షూటింగ్ ఆలస్యమవుతూ వచ్చింది. దీంతో దాదాపు నాలుగేళ్లుగా ఈ చిత్రం షూటింగ్ దశలోనే ఉంది. వీలైనంత త్వరగా మూవీ షూటింగ్ కంప్లీట్ చేసి రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు.

# కాంగ్రెస్ మోసానికి ఇదే నిదర్శనం



**తెలంగాణ వీణ , హైదరాబాద్** : ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల మీద తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మార్చి 31 వరకు అవకాశం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో.. ప్రభుత్వం నిర్ణయంపై మాజీ మంత్రి హరీష్ రావు ట్విట్టర్ వేదికగా స్పందించారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని హరీశ్ రావు మండిపడ్డారు. అధికారంలోకి రాగానే.. ఎల్ ఆర్ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్.. నేడు మాట తప్పిందని ఆరోపించారు. ఎల్ ఆర్ఎస్ పేరిట ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని హరీశ్ రావు దుయ్యబట్టారు.నో ఎల్ ఆర్ఎస్– నో బీఆర్ఎస్ అంటూ గతంలో ప్రజలను రెచ్చగొట్టి ఇపుడు ఎల్ ఆర్ఎస్‌కు ఫీజులు వసూలు చేస్తామనడం కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలకు నిదర్శనమని హరీశ్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో తాము చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీష్ రావు ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు గతంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన ప్రకటనలకు సంబంధించిన పేపర్ కటింగులను జత పర్చారు హరీశ్ రావు.

# ఎనిమిదిమంది రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో** : ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం రెబల్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నారు. పార్టీ ఫిరాయించారన్న ఫిర్యాదులతో ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.



శాసనసభలో ఈ ఎనిమిది స్థానాలూ ఖాళీ అయినట్లు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు ఎన్నికల సంఘానికి వెంటనే సమాచారాన్ని పంపారు. వైఎస్సార్‌సీపీ రెబల్ ఎమ్మెల్యేలు ఆనం రాంనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి... టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలు కరణం బలరాం, వల్లభనేని వంశీ, మద్దాలి గిరిధర్, వాసుపల్లి గణేష్‌లపై అనర్హత వేటు పడింది. రాష్ట్ర విభజన తర్వాత అసెంబ్లీలో ఇంత పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలపై వేటు పడడం ఇదే తొలిసారి. ఇవాళ గెజిట్ వెలువడనుండగా.. మరో పది రోజుల్లో సాధారణ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సమయంలో అనర్హత వేటు ఆసక్తికరంగా మారింది.వైఎస్సార్‌సీపీ రెబల్ ఎమ్మెల్యేలు నలుగురిపై శాసనసభలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే టీడీపీ రెబల్ నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని టీడీపీ విప్ డోలా బాలవీరాంజనేయస్వామి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పీకర్ జనవరి 29న తొలిసారి ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా మాట్లాడేందుకు పిలిచారు. వైఎస్సార్‌సీపీ రెబల్ ఎమ్మెల్యేలు నలుగురూ స్పీకర్ ముందు హాజరై వివరణ ఇచ్చారు. తమపై ఫిర్యాదు చేస్తూ చీఫ్‌విప్ సమర్పించిన ఆధారాలకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను తమకు ఇవ్వాలని.. వాటిని పరిశీలించి మళ్లీ వస్తామని స్పీకర్‌కు తెలిపారు.ఆ తర్వాత స్పీకర్ కార్యాలయానికి.. ఎమ్మెల్యేలకూ మధ్య కొన్ని నాటకీయ పరిణామాలు జరిగాయి. టీడీపీ రెబల్ ఎమ్మెల్యేల్లో వాసుపల్లి గణేష్ మాత్రమే జనవరి 29న జరిగిన విచారణలో స్పీకర్ ముందు హాజరయ్యారు. మిగిలిన ముగ్గురూ స్పీకర్‌ను కలవలేదు. తర్వాత కూడా ఎమ్మెల్యేలకు వ్యక్తిగత విచారణ కోసం స్పీకర్ సమయం ఇచ్చినప్పటికీ వారు హాజరు కాలేదు. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన స్పీకర్ తమ్మినేని ఎనిమిది మంది ఎమ్మెల్యేలపైనా అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.తమ పార్టీ తరఫున గెలిచి మరో పార్టీకి మద్దతు తెలిపిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఇరు పార్టీల నుంచి ఫిర్యాదులు అందినా చాలారోజులపాటు వీటిని పెండింగ్‌లో పెట్టారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని నిలబెడుతుందనే వార్తలతో 'అనర్హత పిటిషన్ల'లో కదలిక వచ్చిందనే విమర్శలు వచ్చాయి. కానీ.. అభ్యర్థిని నిలపాలనే ఆలోచనను టీడీపీ చివర్లో విరమించుకుంది. అయితే ఇప్పుడు ఎనిమిదిమంది టీడీపీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది.

# రోజా ఓ ఐటెం రాణి.. చేపల పులుసు పెడితే ఇక్కడ పదవులు రావు: బండ్ల గణేశ్

**తెలంగాణ వీణ , సినిమా** : ఏపీ మంత్రి రోజాపై సినీ నిర్మాత, నటుడు, కాంగ్రెస్ నేత బండ్ల గణేశ్ మరోసారి మండిపడ్డారు. రోజా ఒక ఐటెమ్ రాణి అని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ ఒక జాక్ పాట్ సీఎం అంటూ రోజా వ్యాఖ్యానించిన నేపథ్యంలో... ఆమెకు బండ్ల గణేశ్ గట్టిగా కౌంటర్ ఇచ్చారు. రోజా ఒక డైమండ్ రాణి అని... ఆమె పని చేస్తున్న పార్టీ నాయకుడు ఒక యాక్సిడెంటల్ సీఎం అని అన్నారు. రేవంత్ ఒక డైనమిక్ లీడర్ అని... రోజా మాదిరి చేపల పులుసు వండి పెడితే ఇక్కడ పదవులు రావని చెప్పారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ పై కూడా బండ్ల గణేశ్ సెటైర్లు వేశారు. కేటీఆర్ మానసిక క్షోభలో ఉన్నారని... పగవాడికి కూడా అలాంటి పరిస్థితి రాకూడదని అన్నారు. కేటీఆర్ చుట్టూ ఈగో వైఫై మాదిరి ఉంటుందని... వచ్చే ఎన్నికల్లో ఏదో సాధిస్తామనే భ్రమల్లో ఉన్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో కేటీఆర్ కు మరిన్న కష్టాలు తప్పవని జోస్యం చెప్పారు. లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే 17 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు ఎవరో కేటీఆర్ చెప్పాలని అన్నారు. ఫోన్ రింగ్ అయినా కేటీఆర్ భయపడిపోతున్నారని చెప్పారు. కేసీఆర్ కొడుకుగానే తప్ప కేటీఆర్ కు మరే గుర్తింపు లేదని అన్నారు.

